

# కబుర్లో — క్రైకర్ కాయలు

ఆదోవూరు. 'మందేవూరు?' అని అడిగినట్టు-మందే ఆవూరు. మనుషులంతా కలిసినా కలవకపోయినా, ఆ వూరి మధ్యవున్న నాలుగు రోడ్లు కలుస్తాయి. త్రివేణి సంగమంకంటె గొప్పగా వుంటుందని, 'ఆంధ్రుడు అన్నిటా తక్కినవాళ్ళకంటె పైన వుండాలా' అని ఆ వూరివాళ్లు దానికి చతుర్వీధి సంగమం అని ముచ్చటగా సంస్కృతంలో పేరు పెట్టుకొన్నారు. ఏదైనా విశేషం వచ్చినా, పండగా పబ్బంవచ్చినా, చతుర్వీధి సంగమంలోనే జరుగతాయి.

ఆవాళ అక్కడ సాగుతున్న మీటింగు దేనికంటే తొట్టతొలి భారతీయుడు అంతరిక్షయాత్ర చేసి సురక్షితంగా తిరిగి వచ్చినందుకు వార్తాపత్రికల్లో వచ్చిన రాకేష్‌శర్మ బొమ్మని కత్తిరించి బల్లమీద పెట్టారు. బల్ల వెనకాల అధ్యక్షులవారు నిలబడివున్నారు.

"ఈ విధంగా భారతీయుడు కూడా అంతరిక్షయాత్రలు చెయ్యడం భారత దేశం గర్వించదగ్గ విషయం. భారతీయులు తక్కిన ఏదేశాంవారికీ తీసిపోరనీ, త్వరలోనే చంద్రమండలానికి సూర్యమండలానికీ ఆ పైన నక్షత్ర మండలాలకి కూడా ఏదో ఒక దేశాన్ని బతిమాలి, వెళ్ళి, మనదేశానికి ఖ్యాతి తీసుకురాగలరనీ నేను నమ్ముతున్నాను." అన్నారు అధ్యక్షులవారు.

ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేస్తూ ఉండగా ఒకాయన లేచినిలబడి "సోదరులారా! భారతీయుడు, భారతీయుడు అని మనం అనడం మంచిదేగాని నిజానికి ఈ సభ మనం ఇక్కడ ఎందుకు చేస్తున్నామంటే రాకేష్‌శర్మ తెలుగువాడు గనక ఒక తెలుగువాడు ఈ ఘనకార్యం సాధించగలిగాడు గనక, ఇది తెలుగు జాతికే గర్వకారణం!" అన్నాడు తనే చప్పట్లు చరుస్తూ.

"కాదు కాదు! అతడు తెలుగువాడు కాదు" అన్నారు కొందరు సభలోంచి.

"అవును. అతనిది హైద్రాబాదు, అతని చిన్నతనం అక్కడ గడిచింది. అతని తలిదండ్రులు ఇప్పుడు అక్కడే ఉన్నారు. పైగా మనవూరి ప్లీడరుగారైన జగన్నాథశర్మగారి బావమర్ది రాజేశ్వర శర్మ ఏం చెప్పాడంటే, రాకేష్‌శర్మ స్వయానా ఆయనకి దగ్గర బంధువని.

రావికొండలరావు

ఇంతకన్న నిదర్శనాలేం కావాలి?"

"కాదులెండి. అతను తెలుగువాడుకాడు. అతని మాతృభాష తెలుగుకాదు. అందుకని భారతీయుడ్ని ప్రస్తుతానికి గర్వపడదాం" అన్నారు అధ్యక్షులవారు.

"రాకేష్ శర్మ తెలుగువాడు కాదు—కాదు" అన్నారు సభాసదులు గోలగా.

ఇంకొకాయన లేచి నిలబడి "నాదొక మనవి. ఈసారి మళ్ళీ ఇంకొక భారతీయుడిని పైకి పంపిస్తామంటున్నారు. ఆ భారతీయుడైనా తెలుగువాడు కావడానికి మనమంతా తీవ్రంగా కృషి చెయ్యాలి'' అన్నాడు చప్పట్లుకొడుతూ.

"అవును - అవును! కృషి చెయ్యాలి! కృషి చెయ్యాలి!" అన్నారు సభాసదులు.

ఇంకొకాయన ఛటున లేచి-

"అవును! రేపాలి! అలజడి రేపాలి" అన్నాడు ఆపూపు అందుకుని, ముందు మాట్లాడుతున్న ఆయన "కాబట్టి, సమావేశ సదులారా! అవసరమైతే అందుకు మనం రైళ్ళు ఆపాలి బస్సులు కొల్లగొట్టాలి. ఊళ్లు తగల బెట్టాలి విద్యార్థులందరూ బళ్ళూ కళాశాలలు మానివెయ్యాలి. మన తెలుగువాడిని అంతరీక్షానికి పంపేవరకూ, మనం విశ్రమించకూడదు ఇవాళ రాకేష్ శర్మగారు, యావత్ప్రపంచ ఖ్యాతి ఎలా గాంచారో, అంతగా కాకపోయినా సగం ప్రపంచపు ఖ్యాతినైనా ఆంధ్రుడికిదక్కేలాగా మనం అలజడిని కలిగించాలని, సభాసదుల్ని కోరుతున్నాను"

చాలామంది చప్పట్లు కొట్టారు. అంతలో ఒక వృద్ధుడు అక్కడికక్కడే లేచి- "అవునూ-అంతరిక్షయాత్రకి ఎందుకేశ్ ఇంత గొడవ? మా పెద్దబావ, రిక్షా ఏసుకుని గోదారి జిల్లాలు రెండూ రెండ్రోజుల్లో తిరిగొచ్చాడు. అంత రిక్షా యాత్ర ఈడు సెయ్యలేదా మరి- ఆడి ఫోటో ఎట్టరేం-" అన్నాడు.

అందరూ నవ్వారు. అధ్యక్షులవారు "ఇది అంత-రిక్షా యాత్ర కాదు పెద్దయ్యా- అంతరిక్షయాత్ర అంటే ఆకాశంలోకి వెళ్ళడం, వెళ్ళితిరిగిరావడం!" అన్నారు

ముందాయన "పెద్దలారా! నాదొకమనవి రేపో అంతరిక్ష యాత్రికుడిగా తెలుగువాడిని ఎన్నుకోవాలంటున్నారు. పాయింటే. కాని, ఏ తెలుగువాడిని ఎన్నుకుంటాం— అన్నది పాయింటు అంటే ఏజిల్లా వాడిని ఎన్నుకోవాలి? అందులో మళ్ళీ మధ్య జిల్లాల వాళ్ళకే ఆధిక్యత ఇచ్చే అవకాశం వుంది-ఆలోచించండి" అన్నాడు.

"నిజమే...నిజమే! సత్యం పలికాడు!" అన్నాయి కొన్ని కంచుకంఠాలు. ఇంకొకాయనలేచి "మాది ఈఊరుకాకపోయినా ఈ మీటింగు చూడవచ్చినవాడిని. మాది బాగా వెనుకబడిన జిల్లా...

ఆ అవకాశం మా వెనుకబడిన జిల్లాకి ఇప్పించాలని నేను మనవి చేస్తున్నాను"

"అవును కలిగించాలి" అన్నాయి కొన్ని గొంతులు.

"వదరదు! మా జిల్లాకే కలిగించాలి!'' అన్నాయి కొన్ని కంఠాలు.

అధ్యక్షులవారు లేచారు—"ఈ సభ మన ఊళ్ళో జరుగుతున్న సభ గనక, ఈ కోరిక మన దగ్గర్నుంచే వస్తోంది గనక మన జిల్లా వాడినే ఎన్నుకోడం సబబని నా అభిప్రాయం''

"అసంబద్ధం!' అంటూ ఇంకోకాయన లేచాడు "ఈ జిల్లావాడిని అంటే ఏ వూరు వాడిని అది చెప్పండి ముందు. జిల్లా కేంద్రంలో ఉన్న వ్యక్తిని ఎన్నుకోవాలా—లేక..."

"కుదరదు—కుదరదు" అన్నారు కొందరు. అధ్యక్షులవారన్నారు "ఈ సభ ఇక్కడే చేస్తున్నాం గనుక, ఈ వూరి వాళ్ళలోనే ఎవర్నో ఎన్నుకోవాలి. వేరే ఊరు ఎందుకు?"

చప్పట్లు మిన్ను ముట్టాయి హాహాకారాలు అంతరిక్షం అందుకున్నాయి. "అయితే ఈ ఊళ్ళో అలాంటి వ్యక్తి ఎవరన్నది మనం ఆలోచించి ప్రభుత్వానికి సిఫార్సు చెయ్యాలి" అన్నారు అధ్యక్షుల.

"అయ్యో! నాదొక మనవి!" అంటూ లేచాడు ఒకాయన. ఇవాళ అగ్రకులాల వాళ్ళే అన్నింటా ముందంజవేస్తున్నారు. అంచేత ఆ కులాలకి సంబంధించిన వాళ్ళలోనే ఎవర్నో ఎన్నుకుంటే బావుంటుంది" అన్నాడు.

"నాన్ సెన్స్! తప్పు! కూచో" అని కొందరు ఉద్రేకంగా కేకలు వేశారు. ఆ కేకలకి గుండె దెబ్బకి పిట్ట కూలి పోయినట్టు-కూచుండి పోయాడతను.

"అన్నీ అగ్రజాతులవాళ్ళకే కట్టబెట్టా లనుకోవడం అన్యాయం! అక్రమం! నిజా నికి ఇది షెడ్యూల్డు తరగతుల వాళ్ళకి రిజర్వు చెయ్యాలి!" అన్నాడు ఇంకొకాయన.

అవునని కొందరూ, కాదని కొందరూ వాదించుకున్నారు:

"రిజర్వేషన్ విధానం వచ్చిన దగ్గర్నుంచి షెడ్యూల్డు తరగతులవాళ్లు బాగానే ఉంటున్నారు. ఇది మాత్రం వాళ్ళకి వెళ్ళకూడదు. ఇంకెవరికయినా వెళ్ళేలా చూడాలి!"

"అగ్రజాతుల వాళ్ళంటా ఎవరు? అందులో మళ్ళీ ఎవరికి? బ్రాహ్మణులకా క్షత్రియులకా?...అది తేల్చండి ముందు"

"బ్రాహ్మణులకే చెందాలి అతను బ్రహ్మ


40500/- రు విలువైన బహుమతులు గెలవండి

(ఎంట్రీ ఫీజు లేదు)

| | | |
|---|---|---|
| 11 | 16 | 9 |
| 10 | 12 | 14 |
| 15 | 8 | 13 |

(మాదిరి మొత్తం 36)

మొదటి బహుమతి: కలర్ టి.వి. రెండవ బహుమతి : 10 కెమెరాలు. మూడవ బహుమతి ; నేషనల్ టు ఇన్ వన్ ప్రైస్‌లింక్ వ్యాపార అభివృద్ధి పథకంపై 175/- రూ॥లకే. నిబంధనలు : పై విధంగా గళ్ళు గీసి 11 నుంచీ 19 వరకు ఏవి కూడినా మొత్తం 45 వచ్చేలా అంకెలని ఉపయోగించాలి. మొదట చేరిన 5 ఎంట్రీలకి ఎలక్ట్రానిక్ వాచిలు లభిస్తాయి. 15 రోజుల లోగా ఇంగ్లీషులో పోస్ట్ కార్డుపై రాసి పంపండి.

CHOICE INDIA (W-14) Nirmal puri MKT-Delhi-24.

# కబుర్లు- క్రాకర్ కాయలు

## రావి కొండలరావు

'ఆర్యూ ఎ తెలుగూ మ్యాన్?' అని ఏ మాత్రం తెలుగుప్రాంతం కాని, ఎక్కడో ఒకచోట ఒకాయన మిమ్మల్ని తెలుగు వాడిగా గుర్తుపట్టి అడిగాడనుకొండి-సందేహంలేదు, అలా అడిగిన ఆ ఆసామీ కచ్చితంగా తెలుగువాడే!

ఇంగ్లీష్‌పదం దొర్లకుండా ఒక పెద్ద సెంటెన్స్ నువ్వు మాట్లాడుచూద్దాం.." అన్నాడొకడు. "నీ ప్రశ్నలోనేవుంది ఇంగ్లీష్ ముక్క. ఇహనాచేత ఏమి చెప్పిస్తావు?-ఇంపాజిబుల్" అన్నాడు రెండో వాడు. 'మనం తెలుగువాళ్ళమ్ అయినా, ఇంగ్లీష్ మాట్లాడకపోతే, నేర్చుకున్న భాషంతా ఏమైపోయేట్టు?' అంటారు కొందరు వాపోతూ. తెలుగువాళ్ళ మీటింగుల్లో ప్రతిప్రెసిడెంట్‌గారూ ఇంగ్లీష్‌లోనే మాట్లాడతాడు. పైగా, 'నాకు తెలుగులో ప్రసంగించడం అంత అలవాటు లేదు' అంటాడు. అలవాటంతా ఇంగ్లీష్‌లోనే అయినట్టు. సాంస్కృతిక సభలూ, సమావేశాలూ జరిగినపుడు, అందులో పాల్గొనే వాళ్ళంతా తెలుగు వాళ్ళే, వచ్చేవాళ్ళూ తెలుగువాళ్ళే అయినా ఇన్విటేషన్స్ అనబడే-ఆహ్వాన పత్రాలు ఇంగ్లీష్‌లోనే ఉంటాయి తెలుగుకథరాస్తే ఫ్లైసన్ని ఇంగ్లీష్‌మాటలు దొర్లినట్టు-వ్యాసాల్లోనురోడ్డురోలర్లు దొర్లినట్టుదొర్లు తూవుంటాయి.

కొందరు ఉపన్యాసకులు కొంత వరకూ తెలుగులో మాట్లాడి, అక్కడి నుంచి ఆంగ్ల ప్రసంగంలోకి వెళ్ళిపోయి, ముక్తాయింపుకి తెలుగులోకి వచ్చేసి "నాకీ అవకాశం ఇచ్చిన..." అని పూర్తిచేసి "థాంక్యూ" అని కూచుంటాడు. 'నాకు సరిగా తెలుగురాదు' అని చెప్పుకోవడం మనకదో గొప్ప! 'మావాడికి తెలుగు చదవడం రాదండీ! కాన్వెంటు స్కూలు గదూ' అని గొప్పగా చెప్పుకోవడం ఇంకా గొప్ప! అంలెందుకూ ఆ మధ్య మద్రాసుల్లో అఖిల భారత తెలుగు మహాసభలు జరిగాయా—చాలామంది ఆంగ్ల ప్రసంగాలే చేశారు—ఆసభలో పాల్గొన్న తమిళనాడు మంత్రి హాండే మాత్రం తెలుగులో మాట్లాడాడు! అదీ జోకు! ఇంకా జోకేమిటంటే, భారతియార్ 'సుందర తెలింగినిల్ పాట్టుసెయువోమ్' అని తెలుగును మెచ్చుకున్నాడనీ, తెలుగును "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అన్నారనీ, "దేశ భాషలలో తెలుగు లెస్స!" అనే- ఓ పక్క నుంచి చెబుతూనే, ఆంగ్లంలోనే మాట్లాడకం! "చేయెత్తి జైకొట్టు తెలుగోడా" అన్నట్టు భాషని నిద్ర పుచ్చేస్తున్నాం? ●●●